క్లుప్తంగా

అభివృద్ధి పనులకు ఎంపీ నిధులు


పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి

పుంగనూరు: నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి నిదులు మంజూరు చేశారు. శుక్రవారం ఆయన నిధుల విడుదల వివరాలను ఒక ప్రకటనలో తెలియజేశారు. సదుం మండలం రామాపురంలో కమ్యూనిటీ భవనానికి రూ.10 లక్షలు, పునుగువారిపల్లెలో పైపులైన్ల కోసం రూ.5 లక్షలు, పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీపాళెంలో అయ్యప్పస్వామి ఆలయం వద్ద బోరు ఏర్పాటుకు రూ.2 లక్షలు మంజూరు చేసినట్లు ఎంపీ తెలిపారు. పనులను త్వరిగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఇంధనం పొదుపు డ్రైవర్లకు బహుమతులు


ఆర్టీసీ డ్రైవర్లను నగదు ప్రోత్సాహకాలతో అభినందిస్తున్న డీఎం సుధాకరయ్య

పుంగనూరు: ఇంధనం పొదుపులో ప్రముఖంగా నిలిచిన ఆర్టీసీ డ్రైవర్లకు బహుమతులను పుంగనూరు డిపో డీఎం సుధాకరయ్య నగదు ప్రోత్సాహకాలతో అభినందించారు. శుక్రవారం డిపో కార్యాలయంలో డ్రైవర్లు బీఏ ఖాన్, అన్వర్, రెడ్డెప్ప, సురేష్‌కు నగదు ప్రోత్సాహకాలు అందజేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఇంధనం పొదుపు పరంగా కృషి చేసి సంస్థను లాభాల బాటలో పయనించేందుకు తమవంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ పావని, అసిస్టెంట్ మేనేజర్ మురళి, డిప్యూటీ సూపరింటెండెంట్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక వైద్య శిబిరం ప్లీజ్!

రొంపిచెర్ల: దివ్యాంగులకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇర్షాద్ కోరారు. శుక్రవారం రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు దినేష్ కుమార్ నాయక్, వినయ్‌ను సన్మానించి ఆయన మాట్లాడారు. సదరం సరిఫికెట్లు లేక అర్హత ఉన్న పెన్షన్ పొందలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లను మంజూరు చేయాలని, అలాగే ప్రత్యేక శిబిరంలో వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు మహ్మదాలీ, ఆనందరాజు, అబ్దుల్ రెహమాన్, హనీఫ్, వాసు, దిలీప్ , సీహెచ్‌ఓ కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ


నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న ప్రిన్సిపల్ జయప్రకాష్

చౌడేపల్లె: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం ప్రిన్సిపల్ జయప్రకాష్ నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కార్యక్రమంలో భాగంగా వీటిని అందజేశామన్నారు. విద్యార్థులు కళాశాలకు సక్రమంగా హాజరు కావాలన్నారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా చదవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాలాజి, సుబ్రమణ్యం, సుబ్బయ్య, యశోదమ్మ తదితరులు పాల్గొన్నారు.

మామిడి తోటకు నిప్పు

చౌడేపల్లె: ఆగంతకులు మామిడితోటకు నిప్పు పెట్టడంతో సుమారు రూ.20 వేల ఆస్తినష్టం కలిగిందని బాధిత రైతు సతీష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. కాగతి పంచాయతీ జంగాలపల్లె సమీపంలోని మామిడి తోటకు ఆకతాయిలు నిప్పుపెట్టడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పుంగనూరు ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పారు.

పారిశుద్ధ్య పనులు పరిశీలించిన డీపీఓ


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీపీఓ

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట గ్రామ పంచాయతీలో ప్రత్యేక పారిశుద్ధ్యం పనులను శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ, మంచినీటి ట్యాంకులను క్రమం తప్పకుండా క్లోరినేషన్, తాగునీటి నాణ్యత పరీక్షలు చేయించాలని, హోటల్ నిర్వాహకులు రోడ్డు పక్కన చెత్త వేయకుండా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలాజి, పంచాయతీ విస్తరణాధికారి శారదా దేవి, సర్పంచ్ అరుణ, పీఎస్ రెడ్డి ప్రకాష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి పూలే

- పలుచోట్ల ఘనంగా పూలే జయంతి వేడుకలు

పలమనేరు: బడుగు, బలహీన వర్గాల్లో చైతన్యం నింపి వారి అభ్యున్నతికి పాటు పడిన మహనీయుడు జ్యోతిబా పూలే అని స్థానిక బీసీ ఫ్రంట్ అధ్యక్షులు గోవిందుస్వామి స్మరించారు. శుక్రవారం పూలే 199వ జయంతి పురస్కరించుకుని స్థానిక ఏటీఎం సర్కిల్లో బీసీ ఫ్రంట్ నాయకులు, సీఐటీయూ కార్యాలయంలో గిరిధర్‌గుప్తా ఆధ్వర్యంలో, స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులు పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో బీసీ నాయకులు, అధికారులు మాట్లాడారు. ఎప్పుడైతే బీసీలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బలోపేతం అవుతారో అప్పుడే దేశం అభివృద్ధి చెందినట్లన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాన్ని అంకితం చేసిన పూలే ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలన్నారు.


పలమనేరు: పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ ఫ్రంట్ నేతలు


పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో..


పలమనేరు సీఐటీయూ కార్యాలయంలో..

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండల కేంద్రంలో పలువురు వాల్మీకి సంఘ నాయకులు, అధికారులు ప్రజా ప్రతినిధులు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పూలే అడుగు జాడల్లో నడిచి సమ సమాజ స్థాపనకు కృషి చేస్తామన్నారు. అలాగే పూలే దంపతులకు భారతరత్న ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ రెడ్డెప్ప, తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీఓ బాలాజి, వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షులు గడిదేశి వెంకటమణ, పలమనేరు నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు దొరస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధరం, పెద్దపంజాణి మండల అధ్యక్షుడు మణి తదితరులు పాల్గొన్నారు.


పెద్దపంజాణిలో..


వి.కోటలో..

వి.కోటలో..

వి.కోట: స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో పూలే జయంతి నిర్వహించారు. పూలే దేశంలోనే తొలి బాలికా పాఠశాలను ప్రారంభించి సత్యశోధక సమాజ స్థాపకుడని, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని స్మరించారు. కార్యక్రమంలో గణపతి, సోమశేఖర్, దొరస్వామి, పవన్, చిట్టి బాబు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: పూలే జయంతి జయంతి పురస్కరించుకుని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే బీసీ నాయకులు అద్దాల నాగరాజ, కృష్ణమూర్తి, కాంగ్రెస్ నాయకుడు సజ్జాద్ నివాళులర్పించారు. మాల మహానాడు నాయకులు ఎన్ఆర్ అశోక్, శ్రీనివాసులు, శంకరప్ప, జేవీ నాగరాజ, ఎంఆర్‌పీఎస్ నాయకుడు నరసింహులు వేర్వేరుగా పూలే విగ్రహానికి నివాళులర్పించారు. పూలే బాటలో పయనించి బడుగులు మరింత రాణించేందుకు కృషి చేయాలన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద జ్యోతిబా పూలే చిత్రపటాన్ని ఏర్పాటు చేసి విద్యావేత్త డాక్టర్ రఘునాథ నివాళులు అర్పించారు. మండల బీసీ సంఘం అధ్యక్షుడు నూరేషా, గిరిబాబు, ఓబులేసు, హోటల్ మస్తాన్, మురగ, ఖయ్యూం, జగన్, ఆశోక్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- **నేడు మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు, అన్నదానం**

పలమనేరు: పలమనేరు మాజీ ఎమ్మెల్యే, పార్టీ కన్వీనర్ ఎన్ వెంకటేగౌడ పుట్టినరోజు సందర్భంగా శనివారం ఉదయం 10 గంటలకు ఏటీఎం సర్కిల్‌లో కేక్‌కటింగ్, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు పట్టణ కన్వీనర్ హేమంత్‌కుమార్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాలు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

- **17న మున్సిపల్ వేలం పాటలు**

పుంగనూరు: పట్టణంలోని ప్రైవేటు బస్టాండు, షాపు రూములు మొదలైన వాటికి ఈనెల 17న వేలం నిర్వహిస్తున్నట్లు శుక్రవారం కమిషనర్ మధుసూదన్‌రెడ్డి విలేకరులకు తెలిపారు. వాయిదా వేసిన వేలం పాటలను 17న ఉదయం 11 గంటలకు తిరిగి నిర్వహిస్తున్నామని , ఆసక్తి గల వ్యాపారులు 16న తమ సాల్వెన్సీ సర్టిఫికెట్లను సమర్పించి వేలంలో పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కుప్పం రూరల్: గుత్తార్లపల్లె వద్ద ఉన్న కుప్పం 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కుప్పం మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు రెస్కో ప్రాజెక్ట్ ఇంజినీర్ ప్రభాకర్ తెలిపారు.

చదువుతోపాటు సంస్కారం ముఖ్యం


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వెంకటేశులు బాబు

పలమనేరు: విద్యార్థులు చదువుతోపాటు సంస్కారం కలిగి ఉండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు బాబు అన్నారు. శుక్రవారం కళాశాలలో 42వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ, 82 విద్యార్థులతో మొదలైన కళాశాల ఇప్పుడు 900పైగా విద్యార్థులతో నడుస్తోందన్నారు. ఇక్కడ చదివిన ఎందరో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని, అన్నింటా కళాశాల ముందుండడంతో ఏ–గ్రేడ్ పొందిందని పేర్కొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు ఉర్రూతలూగించారు. కళాశాల అభివృద్ధికి పాటుపడుతున్న సీతారామయ్య, ఏఎంసీ సెక్రటరీ సంజీవకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన ముఖ్యం


సమావేశంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి లిఖిత

పలమనేరు: వివిధ పరిశ్రమలు, పాల డెయిరీల్లో పనిచేసే కార్మికులకు కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పలమనేరు ఫస్ట్‌క్లాస్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి లిఖిత అన్నారు. కార్మిక చట్టాలపై శుక్రవారం మండలంలోని మొరం సమీపంలోని ఓ డెయిరీ కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, యాజమాన్యాలు నిర్లక్ష్యం చేసినా శిక్షలు తప్పవన్నారు. ముఖ్యంగా వేతనాలు సకాలంలో నిర్దేశించిన మేర ఇవ్వాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. పాల ఆధారిత ఆహారోత్పత్తులు కల్తీ లేకుండా నాణ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు భాస్కర్, సీనియర్ న్యాయవాదులు, పట్టణ సీఐ నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

రాహుకాల అభిషేక పూజలు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేశారు. రాహుకాల సమయాన సాంప్రదాయ రీతిలో అర్చనలు, అభిషేక పూజల అనంతరం ప్రత్యేకంగా బంగారు నగలు, రంగు రంగు పూలతో ముస్తాబు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తుల సౌకర్యార్థం ఉచిత అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఈఓ ఏకాంబరం పర్యవేక్షించారు.



ఆర్టీసీ కార్మికుల నిరసన



కుప్పం: కుప్పం ఆర్టీసీ డిపోలో నేషనల్ మజ్దూర్ యూనియన్ కార్మికుల నిరసన శుక్రవారం కూడా కొనసాగించారు. కొన్నేళ్లుగా ఆర్టీసీ కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం పోరాటం సాగిస్తున్నా పరిష్కరించడం లేదని విమర్శించారు. ఉద్యోగులకు ఈఎస్‌హెచ్ కార్డుకు బదులు పాత పద్ధతిలో సీలింగ్ లేని వైద్య సౌకర్యం కల్పించాలని, పెండింగ్‌లో వున్న ఏఏఎస్ ఇంక్రిమెంట్లు, పనిష్మెంట్ పూర్తయిన వారికి సకాలంలో ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలకు చైల్డ్ కేర్ సెలవులు మంజూరులో జాప్యం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ డిపో అధ్యక్షుడు మునుస్వామి, కార్యదర్శి జయపాల్, కార్మికులు బాలకృష్ణ, అరుణ్, నాయక్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించండి


మాట్లాడుతున్న మాల మహానాడు కార్యదర్శి అశోక్

పుంగనూరు: ఎస్సీ, ఎస్టీల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ రాము, కమిషనర్ మధుసూదన్ రెడ్డి, ఎంపీడీఓ లీలామాధవి ఆధ్వర్యంలో కమిటీ సమావేశం నిర్వహించారు. సభ్యులు అశోక్, శ్రీనివాసులు, రాజు మాట్లాడారు. మానిటరింగ్ కమిటీ సమావేశాల నిర్వహణ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలన్నారు. క్రమం తప్పకుండా వీటిని నిర్వహించాలని, సమావేశాల్లో ప్రస్తావించే సమస్యలను నెలలోపు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని, ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారంలో ఎవరు నిర్లక్ష్యం వహించినా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై అవగాహన


సంతలో అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు

పలమనేరు: పట్టణంలోని వారపుసంతతో పాటు పలు దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల విక్రయాలపై స్థానిక మున్సిపల్ అధికారులు శుక్రవారం వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఇప్పటికే పట్టణంలో ప్లాస్టిక్ కవర్లను అమ్ముతున్న వారిపై జరిమానాలు విధించామని తెలిపారు. ప్లాస్టిక్ కవర్లను విక్రయించకుంటే ప్రజలు వస్త్ర లేదా జ్యూట్ బ్యాగులు విధిగా వెంట తెచ్చుకుంటారన్నారు. కార్యక్రమంలో మేనేజర్ ఖాదర్, ఆర్వో రవిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారి మృతిపై డీసీహెచ్‌ఎస్ విచారణ

సాక్షి ఎఫెక్ట్..


ఎన్ఎస్‌బీయూ వార్డులో సంఘటన జరిగినప్పుడున్న వారిని విచారణ చేస్తున్న దృశ్యం

పలమనేరు: మూడునెలల చిన్నారి వైద్యం పొందుతూ మృతిచెందిన ఘటనపై జిల్లా కలెక్టర్ ఆదేశాలతో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పద్మాంజలి దేవి శుక్రవారం పలమనేరు ఏరియా ఆస్పత్రిలో విచారణ చేపట్టారు. రెండు రోజుల క్రితం టి.వడ్డూరుకు చెందిన గణేష్ కుమార్తె (మూడు నెలలు) వైద్యం పొందుతూ మృతిచెందిన విషయం తెలిసిందే. వైద్యుల నిర్లక్ష్యం వల్లే చిన్నారి మృతిచెందినట్టు తల్లిదండ్రులు ఆరోపించారు. దీనిపై ఈ ఆస్పత్రికి బిడ్డలను తెస్తే బతకడంలే! అన్న శీర్షికన శుక్రవారం సాక్షి దినపత్రికలో కథనం వెలువడింది. కలెక్టర్ ఆదేశాలతో డీసీహెచ్‌ఎస్ ఆస్పత్రికి చేరుకుని చిన్నారికి వైద్యం అందించిన వైద్యులు, అదే వార్డులోని బాలింతలు, బాధితులను విచారణ చేశారు. ఆమె మాట్లాడుతూ చిన్నారికి వాంతులవుతుండడంతో తల్లిదండ్రులు పట్టణంలోని ఆస్పత్రికెళ్లారని తెలిపారు. వారు చికిత్స చేసి రెఫర్ చేశారని తెలిపారు. ఆపై చిత్తూరులోని నారాయణరెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ డాక్టర్లు పంపకనే తమ వద్ద డబ్బు లేదని తల్లిదండ్రులు పాపను తీసుకెళ్లిపోయినట్టు తెలిపారు. ఇంట్లో పాలు తాగుతుండగా పాపకు శ్వాస ఆడకుండా పోవడంతో స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారని వివరించారు. వైద్యం చేస్తుండగానే చిన్నారి మృతి చెందిందన్నారు. దీనిపై నివేదికను కలెక్టర్‌కు పంపనున్నట్లు తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ మమతారాణి తదితరులు పాల్గొన్నారు.





పేడ దిబ్బల తొలగింపు

రొంపిచెర్ల: గ్రామాల్లో ఇళ్ల మధ్య వేసిన పేడ దిబ్బలను తొలగించాలని, ఆ దిబ్బలను వేసిన వారిపై పంచాయతీ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీలో ఇళ్ల మధ్య ఉన్న పేడదిబ్బలను గుర్తించి జేసీబీలతో తొలగించారు. పేడ దిబ్బలను గ్రామాలకు కనీసం 100 మీటర్ల దూరంలో వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి హరిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటిస్తే రోగాలు దూరం

చౌడేపల్లె: విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతను పాటిస్తే అంటువ్యాధులు దరి చేరవని డాక్టర్ పవన్‌కుమార్ అన్నారు. శుక్రవారం బాలుర బీసీ వసతి గృహం, బాలికల వసతి గృహంలో వేర్వేరుగా విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి హాస్టల్ విద్యార్థి ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు చేతులు, కాళ్లు శుభ్రంగా ఉంచుకునేందుకు హ్యాండ్ వాష్‌పై అవగాహన కల్పించారు. దోమల బారి నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతోపాటు ఈగల వలన వ్యాపించే వ్యాధులను వివరించారు. ఎండల తీవ్రతకు వడదెబ్బకు గురవకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలను విపులంగా తెలియజేశారు.

అంగన్‌వాడీ యూనియన్ ఎన్నికలు ఏకగ్రీవం

రొంపిచెర్ల: పులిచెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు అంగన్‌వాడీ ఏఐటీయూసీ యూనియన్ ఎన్నికలు ఏకగ్రీవమైనట్టు రాష్ట్ర అంగన్‌వాడీ యూనియన్ గౌరవాధ్యక్షురాలు ప్రేమ శుక్రవారం తెలిపారు. పులిచెర్ల ప్రాజెక్టు గౌరవాధ్యక్షురాలిగా అలివేలమ్మ (రొంపిచెర్ల), అధ్యక్షురాలిగా గీత (సదుం), ప్రధాన కార్యదర్శిగా సరస్వతి (రొంపిచెర్ల), కోశాధికారిగా మొబీనాతాజ్ బేగం (పులిచెర్ల), ఉపాధ్యక్షులుగా ప్రేమలత, రమణమ్మ, శశికళ, అమృత, సహాయ కార్యదర్శులుగా ఈశ్వరి, సుజాత, లత, శ్యామల ఎన్నిక అయ్యారు. వీరు మాట్లాడుతూ, అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లావణ్య, సుస్మిత, హసీనా, శోభ, భవిత, సుబ్బరత్న, షాహీనా, షాహీరా, విజేశ్వరి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

